తుపాన్‌ను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంది

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

అనంతపురం టౌన్, ఆంధ్రప్రభ: మొంథా తుపాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ప్రధాని స్వయంగా ఆరా తీశారని, అపార పంట నష్టం జరిగిందని చెప్పారు. గురువారం అనంతపురం జిల్లా రూరల్ మండలంలోని రాజీవ్ కాలనీలో బీజేపీ పార్టీ కార్యాలయంలో మాధవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీఎం మత్స్య యోజన కింద అన్నివిధాలా సాయమందిస్తామని చెప్పారు. అలాగే ఫసల్ బీమా యోజన పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైసీపీ అసత్య ప్రచారాలపై స్పందిస్తూ, ఆ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేక విధానాన్ని అమలు చేస్తోందన్నారు. గూగుల్ వచ్చినప్పుడు, అంతకు ముందు ఇలానే మాట్లాడారు. మొంథా విపత్తు సమయంలోనూ వ్యతిరేక ప్రచారం చేశారు. టీటీడీ ప్రాశస్త్యం తగ్గించేలా కుట్రలు చేశారు. అన్ని విషయాల పైన చర్యలు ఉంటాయని మాధవ్ హెచ్చరించారు. శ్రీవాణి నిధులు, పరకామని నిధులు సహా అనేక విషయాలు పై అనుమానాలు వచ్చాయన్నారు. రాజకీయ జోక్యంతో టీటీడీ పునరావాస కేంద్రంగా మార్చేశారని, భవిష్యత్తులో ఇలాంటివి జరక్కుండా బీజేపీ ముందుకు వెళుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురు ఐపీఎస్‌లకు అదనపు బాధ్యతలు

అమరావతి, ఆంధ్రప్రభ: పలు చోట్ల విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం ఏఎస్పీగా పని చేస్తున్న సురన అంకిత మహావీర్‌కు శ్రీ సత్యసాయి జిల్లా అదనపు అడ్మిన్ అదనపు ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా అకోప్టస్ అదనపు ఎస్పీగా ఉన్న జగదీష్ అడహల్లీకి విశాఖపట్నం సిటీ లా అండ్ ఆర్డర్-1 డీసీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనాకు అల్లూరి జిల్లా అకోప్టస్ అదనపు ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

బ్రహ్మంగారి నివాసం డ్యామేజీపై లోకేష్ తక్షణ స్పందన

● విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఛైర్మన్ కృతజ్ఞతలు

అమరావతి, ఆంధ్రప్రభ: కందిమల్లాయపల్లెలో వీరబ్రహ్మేంద్ర స్వామి స్వయంగా నిర్మించి నివశించిన గృహం భారీ వర్షాలకు పాక్షికంగా కూలిపోయిన విషయం ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే తక్షణం స్పందించినట్లు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ అభివృద్ధి సంక్షేమ సంస్థ ఛైర్మన్ కమ్మరి పార్వతమ్మ హర్షం వ్యక్తం చేశారు. స్వామి వారి నివాసం తక్షణ పునర్నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఇందుకు నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. తుపాన్ ప్రమాదాన్ని ఎదుర్కొనే పనిలో బిజీగా ఉన్న లోకేష్ బాబు ను స్వయంగా కలవక పోయినా తమ కార్యాలయ అధికారులకు తాను చేసిన వినతిని పరిగణలోకి తీసుకొని తక్షణం జిల్లా కలెక్టర్, ఇతర యంత్రాంగాన్ని తక్షణ చర్యలకు అప్రమత్తం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఇదే విషయాన్ని తన ఓఎస్‌డీ ద్వారా సమాచారం ఇచ్చినట్లు ఆమె తెలిపారు. లక్షలాదిమంది భక్తుల మనోభావాలను స్వామి వారి గృహం చారిత్రక ప్రాధాన్యత ను దృష్టిలో ఉంచుకుని పురావస్తుశాఖ సాంకేతిక నిపుణులు, ఆధ్యాత్మిక వేత్తలు, గ్రామస్తులు, భక్తులు, పండితుల సూచనలు సలహాలు స్వీకరించి పునర్నిర్మాణం చేపట్టేందుకు నవంబరు 1న బ్రహ్మంగారి మఠం సందర్శించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. సమస్యపై తక్షణమే స్పందించిన మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్రంలోని 24లక్షలమంది విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గం కుల దైవంగా కొలుస్తూ లక్షలాదిమంది భక్తులు భగవదవతారంగా భావించి దర్శించుకునే పవిత్ర మఠం, పవిత్ర స్వామి నివాస గృహం పై తక్షణం స్పందించి చర్యలు చేపట్టిన కూటమి ప్రభుత్వ యంత్రాంగానికి 25లక్షల విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

చిన్నటేకూరు బాధిత కుటుంబాలకు వి.కావేరి ట్రావెల్స్ రూ. 40 లక్షల సాయం

కర్నూలు, ఆంధ్రప్రభ బ్యూరో: ఈ నెల 24న చిన్నటేకూరు సమీపంలో చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాదంలో మృతులు, గాయపడిన వారి కుటుంబాలకు వేమూరి కావేరి ట్రావెల్స్ యాజమాన్యం రూ.40 లక్షల ఆర్థిక సాయం అందించింది. గురువారం ఉదయం కర్నూలు కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రావెల్స్ ప్రతినిధులు ఈమేరకు చెక్కును రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్, జిల్లా కలెక్టర్ డా.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సమక్షంలో అందజేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేయడం పట్ల మంత్రి భరత్ సంతృప్తి వ్యక్తం చేశారు. బాధితులకు కొంతమేర ఉపశమనంగా ఉంటుందన్నారు. ఈ ప్రమాదంలో మరణించిన 19 మందిలో 17 మంది పెద్దవారికి, ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు చెరో రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.38 లక్షలు, అలాగే తీవ్రంగా గాయపడిన నలుగురికి చెరో రూ.50 వేల చొప్పున రూ.2 లక్షలు అందజేయడం ద్వారా మొత్తం రూ.40 లక్షలు సహాయం అందించారని ట్రావెల్స్ ప్రతినిధులు తెలిపారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ, ప్రైవేట్ రవాణా సంస్థలు సమాజానికి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రమాదంపై దర్యాప్తు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కావేరి ట్రావెల్స్ ప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పరకామణి కేసు ఓ పెద్ద కుట్ర

● టీటీడీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

అమరావతి, ఆంధ్రప్రభ: తిరుమల తిరుపతి దేవస్థానం 2023లో జరిగిన పరకా మణి కేసు దొంగతనం కాదని ఒక పెద్ద కుట్రలా కనిపిస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ.. ఈ కేసు దర్యాప్తులో అడుగుఅడుగునా తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తు న్నాయని, దీనికి నాటి ఛైర్మన్, టీటీడీ అధికారులు, ఈవో బాధ్యు లని ఆరోపించారు. దీనిపై హైకోర్టు సునిశితంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కోట్లాది రూపాయల దొంగతనం చేసిన పరకామణి సూపర్ వైజర్, ముద్దాయి రవికుమార్‌పై నమ్మక ద్రోహం కింద పదేళ్లు శిక్ష పడే వీలున్నా, ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ కేసులో మొదటి నుంచే తప్పటడుగులు పడడానికి ఆనాటి ఈవో ధర్మారెడ్డి, ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిలలో ఎవరు సూత్రధారులని ఆయన నిలదీశారు. అడుగడుగునా పాలనాపరమైన పద్ధతులు, చట్టబద్ధమైన నిబంధనలను తుంగలో తొక్కి దర్యాప్తును కుక్కలు చింపిన విస్తరిలా చేశారని వర్ల రామయ్య మండిపడ్డారు.

రూ.39,000కోట్లతో పోర్టుల అభివృద్ధి

- దేశంలోనే మేజర్ పోర్టుల అభివృద్ధిలో నెం.1 స్థానం సాధించే దిశగా ఏపీ అడుగులు
- ముంబై సదస్సు వేదికగా అభివృద్ధి పనులకు ఒప్పందాలు
- రూ.30 వేల కోట్లతో దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్
- రూ.3 వేల కోట్లతో ఆధునిక స్టాక్ యార్డ్‌లు 500 కోట్లతో విశాఖ హార్బర్ పార్క్ ఆధునీకరణ
- రూ.487 కోట్లతో కార్గో బెర్త్‌ల యాంత్రీకరణ

విశాఖపట్నం, ఆంధ్రప్రభ: దేశంలోనే మేజర్ పోర్టుల అభివృద్ధిలో నెంబర్ వన్ స్థానం సాధించే దిశగా అడుగులు వేస్తున్న విశాఖ పోర్టు ఆధారిటీ తాజాగా పోర్టు నవీకరణ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి మరో కీలక ఒప్పందాలు చేసుకుంది. ముంబాయి వేదికగా ఈనెల 27 నుంచి 31వ తేది వరకూ జరుగుతున్న ఇండియన్ మారిటైమ్ వీక్-2025 కార్యక్రమంలో భాగంగా కేంద్ర పోర్టుల షిప్పింగ్ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఏపీ ప్రభు త్వం, విశాఖ పోర్టు కలసి సయుక్తంగా చేపట్టనున్న పలు కీలక ప్రాజెక్టులకు సంబంధించి ఆయా నిర్మాణ సంస్థల ప్రతినిధులతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. దేశ సముద్ర రంగ సామ ర్థ్యాన్ని, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ప్రతిబిం బించే దిశగా నిర్వహిస్తున్న ఈ మారిటైమ్ సదస్సులో మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు చేపట్టింది. పోర్టులలో మౌలిక సదుపాయాలు, షిప్ బిల్డింగ్, అంతర్గత జలమార్గాలు, గ్రీన్ షిప్పింగ్ వంటి రంగాల్లో భారత్‌ను అంతర్జాతీయ నౌకాయాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ సమావేశాల్లో కీలకంగా చర్చించారు. ఈ సందర్భంగానే విశాఖపట్నం పోర్టు అథారిటీ చ ఏపీ ప్రభుత్వంతో కలిసి దుగ్గరాజ పట్నంలో నిర్మించనున్న మేజర్‌పోర్టు కమ్ షిప్ బిల్డింగ్ అండ్ షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటు కోసం రూ.29,662 కోట్ల విలువైన ఒప్పందపత్రాలను మార్చుకున్నారు.

ఈ ప్రాజెక్ట్ ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయి. ఇది భారత ప్రభుత్వం యొక్క 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యానికి బలాన్ని చేకూర్చుతుంది. ఈ కార్యక్రమంలో సాంకేతిక అంశాలపై చర్చించేందుకు హెచ్‌డీ కొరియన్ షిప్‌బిల్డర్స్ ఆఫ్షోర్ ఇంజినీర్స్ లిమిటెడ్ ప్రతినిధులు, పోర్ట్ ఉన్నతాధికారులు, ఏపీ ప్రభుత్వ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.అలాగే మరో మూడు వేలకోట్ల విలువైన ఆధునిక స్టాక్‌యార్డులు, రైల్వే సైడింగ్స్ అభివృద్ధిపై కూడా ఎంవోయూ చేసు కన్నారు. ఎన్‌బీసీసీతో మరో రూ.500కోట్ల విలువైన ఒప్పందం ద్వారా విశాఖలోని హార్బర్ పార్కులో ఆధునీకరణ పనులు శ్రీకారం చుట్టనున్నారు.

రూ.487.38 కోట్ల విలువైన మరో ఒప్పందం ద్వారా కార్గో బర్త్‌ల యాంత్రీకరణ, ఆధునీకరణ, పర్యావరణ హిత సాంకే తికతల అమలుకు అడుగులు వేయనున్నారు. పోర్టు ప్రాంగణంలో అంతర్గత ఫ్లైఓవర్లు నిర్మించడానికి రైల్ వికాస్ నిలిమిటెడ్ తో మరో రూ.535 కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇండియా మేరిటైమ్ వీక్ సందర్భంగా, పోర్ట్ తన సమగ్ర ల్యాండ్ మోనిటైజేషన్ కార్యక్రమాన్ని ప్రదర్శించారు, దీని ద్వారా పెట్టుబడులు,మౌలిక సదుపాయాల అభివృద్ధి మరింత వేగవంతమవుతాయని పోర్టు ఛైర్మన్ ఎం.అంగముత్తు తెలిపారు. ఇండియా మేరిటైమ్ వీక్-2025లో విశాఖపట్నం పోర్ట్ ...39,216 కోట్లకు పైగా ఒప్పందాలను కుదుర్చుకొని విలువైన పెట్టుబడులను ఆకర్షించాయని, ఇవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధికి, ఉపాధి సృష్టికి దోహదం చేయడమే కాకుండా, నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ, మారిటైమ్ ఇండియా విజన్-2030, జీరో పొల్యూషన్ 2070 లక్ష్యాల సాధనలో కీలక పాత్ర పోషించ నున్నాయి.ఇండియా మేరిటైమ్ వీక్-2025 దేశ సముద్ర వారసత్వాన్ని బలోపేతం చేస్తూ, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్టను మరింత పెంచుతుందన్నారు.

అబద్ధాల తుపాను సృష్టిస్తున్న జగన్

- రైతుల గురించి మాట్లాడే హక్కులేదు
- అన్నదాతలకు అండగా కూటమి సర్కార్
- 95 శాతం పూర్తయిన ఈ-క్రాప్
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: అబద్ధాల తుపాను సృష్టించడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు విమర్శించారు. తుపాను ప్రభావం, పంటల నష్టంపై మాట్లాడే ముందు జగన్ తన పాలనలో రైతులకు చేసిన అన్యాయాలను గుర్తు చేసుకోవాలన్నారు. రైతు సంక్షేమం పేరుతో మాట్లాడే హక్కు జగన్ రెడ్డికి లేదు. ఆయన పాలనలోనే రైతులు కష్టాల బాట పట్టారు. ఉచిత పంటల బీమా పేరుతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని ధ్వజమెత్తారు. బీమా కోసం రైతులు నెలల తరబడి తిరిగినా ఒక్కరూపాయి పరిహారం కూడా అందలేదు. ఇప్పుడు తప్పుడు గణాంకాలు చెప్పి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు అని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 95 శాతం ఈ-క్రాప్ పూర్తయింది. నవంబర్ 12 లోపు 100 శాతానికి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. జగన్ చెబుతున్న ఇ-క్రాప్, ఆర్బీకే, సచివాలయ వ్యవస్థలు కేవలం రాజకీయ ప్రదర్శనలే.. నేల మీద వాటి ఫలితం శూన్యమని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన పంట నష్టం అంచనాలు రూపొందించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, తక్షణ సహాయ చర్యలు, బీమా పరిహారాలు అందచేస్తుందన్నారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముడవుతున్న పంటలకు వెంటనే మార్కెట్ జోక్యాన్ని అందించేందుకు ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి రూ.300 కోట్లను బడ్జెట్‌లో మంజూరు చేసిందన్న విషయం జగన్ గుర్తుపెట్టుకోవాలని అన్నారు.

ఇప్పటివరకు సుమారు రూ.800 కోట్ల వరకు పంటల మద్దతు ధరల కోసం ఖర్చు పెట్టామని తెలిపారు. జగన్ హయాంలో 2020లో మిర్చి ధర రూ12 వేలు ఉన్నామద్దతు ధరగా రూ.7 వేలు మాత్రమే నిర్ణయించి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని అచ్చెన్నాయుడు ఆరపించారు. బర్లీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు కూటమి ప్రభుత్వం 271 కోట్లు వెచ్చించి 20 వేల మిలియన్ కిలోల కొనుగోలు చేసిందన్నారు. తోతాపూరి మామిడి, ఉల్లి, టమోటా రైతులను కూడా ఆదుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ 50 వేల ఆర్థిక సహకారం అందించిన సంగతిని జగన్ గుర్తు పెట్టుకోవాలన్నారు.

మద్యం మైకం.. మరణశాసనం

- చిన్నటేకూరు దుర్ఘటనపై దర్యాప్తు వేగవంతం
- విచారణలో వెలుగులోకి కొత్త కొత్త విషయాలు
- ప్రమాద క్షణాలపై ఎర్రిస్వామి వాంగ్మూలం
- అమ్మ మాట పెడచెవిన పెట్టానంటూ ఆవేదన

కర్నూలు, ఆంధ్రప్రభ బ్యూరో: ఒక తప్పు నిర్ణయం 19 ప్రాణాలను బలి తీసుకుంది, కుటుంబాల్ని చిదిమేసింది. ఒక తప్పు రైడ్... ఒక మైకం... వందల కన్నీళ్లు.. చిన్నటేకూరు ప్రమాదం గుర్తు చేస్తోంది.రోడ్డు మీద మద్యం అంటే మృత్యువుకు ఆహ్వానం పలికినట్లే అన్నది రుజువు చేసింది. కర్నూ లు జిల్లా చిన్నటేకూరు సమీపంలో జరిగిన బస్సు ప్రమాదం రాష్ట్రాన్నే కాదు.. ఏకంగా దేశాన్ని కుదిపేసి న ఈ దుర్ఘటన వెనుక ఒక్క క్షణం నిర్లక్ష్యం, ఒక తప్పు నిర్ణయం ఎంతటి ఘోర విపత్తుకు కారణమైం దో తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రమాదంలో గాయాలతో బయటపడ్డ సి. ఎర్రి స్వామి అలియాస్ నాని వివరణలో, ఆ రాత్రి ప్రతి నిమిషం మృత్యువుతో ఎలా పందెం వేసిందో తేటతెల్లమవుతోంది.

పెళ్లి కోసం వచ్చి.. ప్రమాదం బాటలోకి: హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీలో కాంట్రాక్టర్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎర్రిస్వామి తన మిత్రుడు కల్యాణ్ పెళ్లికి హాజరయ్యేందుకు అక్టోబర్ 23న పెద్దబేకూరుకు వచ్చాడు. అమ్మ ఇంట్లో లేకపోవ డంతో తన మిత్రుడు శివశంకర్‌కు ఫోన్ చేసి పిలిచాడు. తర్వాత ఇద్దరూ పెద్దబేకూరులోని శ్రీ రేణుక ఎల్లమ్మ వైన్స్‌కు వెళ్లారు. రెండు క్వార్టర్లు మద్యం కొని తాగారు. అది సరిపోక మరో రెండు క్వార్టర్లు తాగారు. రాత్రి 9 గంటల తర్వాత ఇంటికి వచ్చి నిద్ర పోయారు. రాత్రి 10:30 సమయంలో తల్లికి ఫోన్ చేసిన ఎర్రిస్వామి రాంపల్లిలోని పెళ్లికి వెళ్తున్నట్లు చెప్పాడు. ఇంత రాత్రివేళ ఎందుకు వెళ్తావురా.. పొద్దున్నే వెళ్లు అని అమ్మ చెప్పినా అతడు పట్టించుకోలేదు. తల్లి మాట వినుంటే ఇంత విషాదం జరిగివుండేదికాదు.. ఇందరి ప్రాణాలు పోయేవికావు.

మద్యం మైకం.. ర్యాష్ డ్రైవింగ్: అర్ధరాత్రి 2:15 గంటల సమయంలో మద్యం మత్తులో ఉన్న శివశంకర్, డోన్‌లో వదిలేస్తానంటూ ఎర్రిస్వామిని బైక్‌పై ఎక్కించుకున్నాడు. ఆ బైక్‌కు హెడ్‌లైట్ లేదు. సిగ్నల్ లైట్ సాయంతోనే ముందుకు సాగారు. మధ్యలో వర్షం మొదలైంది. అప్పటికే 70 కి.మీ.ల వేగంతో వెళ్తున్నారు. చిన్నటేకూరు సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. తలకు దెబ్బతగలడంతో శివశంకర్ అక్కడికక్కడే మరణించాడు. మిత్రుడి మృతదేహాన్ని రోడ్డు పక్కకు లాక్కొచ్చిన ఎర్రిస్వామి, బైక్‌ను కూడా పక్కకు జరిపే ప్రయత్నం చేశాడు. అప్పటికే కొన్ని బస్సులు బైక్‌ను తప్పించుకొని వెళ్లాయి. కానీ, పసుపు రంగు వీ.కావేరి ట్రావెల్స్ బస్సు అతివేగంతో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. బైక్ చక్రాలకింద ఇరుక్కుని మంటలు చెలరేగాయి. డ్రైవర్ కిందికి దిగి మంటలు ఆర్పే లోగా క్షణాల్లోనే బస్సంతా అగ్నికి ఆహుతైంది. నేను చూస్తూనే ఉన్నాను, ఏం చేయలేకపోయాను అని ఎర్రిస్వామి కన్నీళ్లతో వివరించాడు. ఓపక్క భయం.. మరోపక్క ఏంచేయాలో పాలుపోని పరిస్థితి. చివరకు అక్కడి నుంచి పారిపోయాడు. ఐచర్ వాహనంలో లిఫ్ట్ తీసుకుని రాంపల్లికి చేరాడు. పోలీసులు వచ్చేవరకు ఎవరితోనూ చెప్పలేదు. కానీ నా వల్ల ప్రమాదం జరగలేదు. రాత్రి అమ్మ మాట విని ఉంటే ఈ ఘోరం జరిగేది కాదు అని పోలీసు విచారణలో ఎర్రిస్వామి విలపించాడు.

దర్యాప్తు జరుగుతోంది: డీఎస్పీ

బస్సు ప్రమాదంపై పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఉల్లిందకొండ ఎస్ఐ ధనుంజయ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. బైక్ డివైడర్ ఢీకొట్టిన స్థానం, బస్సు వేగం, ప్రమాదం జరిగిన సమయం వంటి సాంకేతిక వివరాలు సేకరిస్తున్నారు. త్వరలోనే నిజానిజాలు గిగుతేలనున్నాయి.

తెలంగాణ మద్యం పాలసీపై ఏపీ దృష్టి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలం గాణలో మద్యం పాలసీపై సమాచార సేకర ణకు ఏపీ ఎక్సైజ్‌శాఖ బృందం గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎక్సైజ్ శాఖ అడిషనల్ కమి షనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ సురేష్ రాథోడ్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులను కలిసి మద్యం పాలసీ విధివిధానలు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ మద్యం అమ్మకాల ఎలా జరుగు తున్నాయని, డీజీటల్ అమ్మకాలు ఎలా జరుగుతున్నాయనే విషయాలపై ఏపీ ఎక్సైజ్ శాఖ గుంటూరు డిప్యూటి కమీషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్ , పలనాడు డీపీఇఓ మణికంఠలు అడిషనల్ కమిషనర్ ఖురేషిని అడిగి తెలుసు కున్నా రు. రిటేల్ మద్యం షాపుల నుంచి డిజిటల్ రూపంలో చెల్లింపులు ఎలా జరుగు తున్నా యని, ఎలాంటి సాఫ్ట్‌వేర్‌ను వినియోగి స్తు న్నారని, పేమేంట్స్‌ను డీజీటల్‌లో ఎలా సమ కూర్చుతున్నారనే విషయాలపై అడిగి తెలుసుకున్నారు.

వరదలపై వైసీపీ దుష్ప్రచారం

- ప్రకాశం బ్యారేజీకి 6 లక్షల క్యూసెక్కుల వరద
- అధికారులు అలర్ట్.. కలెక్టర్లు ముందస్తు జాగ్రత్తలు
- బ్యారేజీని పరిశీలించిన ఇరిగేషన్ మంత్రి రామానాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: వర్షాలు, వరదల పట్ల ప్రభుత్వం అన్నిరకాల ముందస్తు జాగ్రత చర్యలు చేపట్టి, ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటుంటే వైసీపీ మాత్రం సోషల్ మీడియా లో వరదల గురించి దుష్ప్రచారం చేస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రజలు దుష్ప్రచారాన్ని నమ్మవద్దని మంత్రి హితువు పలికారు. గురువారం జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహా మూర్తి, కృష్ణాడెల్టా చీఫ్ ఇంజనీర్ రాంబాబు, ఇతర ఇరిగేషన్ అధికారులతో కలసి ప్రకాశం బ్యారేజ్ దగ్గర కృష్ణానది వరద ప్రవాహాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలతో కృష్ణా,గోదావరి ఉపనదులకు భారీ వరద వస్తుండటంతో జలవనరుల శాఖ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఎగువ నుండి వస్తున్న వరదలను ఎప్పటికప్పుడు ఇరిగేషన్‌శాఖ సమీక్షిస్తోందని, నాగార్జున సాగర్ నుండి విడుదల చేస్తున్న 2 లక్షల క్యూసెక్కుల వరద నీటిని 1లక్ష క్యూసెక్కుల కు తగ్గించడం జరి గిందని అన్నారు. పులిచింతల ప్రాజెక్ట్ నుండి ఉదయం 4.85 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేయగా, దానిని మధ్యాహ్నానికి, 3.85 లక్షలకు తగ్గించామని తెలిపారు.

మున్నేరు పొంగడం తో నాగార్జున సాగర్, పులిచింతల, నుండి వచ్చే వరదతో ప్రకాశం బ్యారేజికి దాదాపు 6 లక్షల నుండి 6.5లక్షల క్యూసెక్కుల కు పైగా వరద వచ్చే అవకాశం ఉండటం తో, దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నా మని తెలిపారు.కృష్ణాడెల్టా పరిధిలో అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, మందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం,అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో వాగులు పొంగుతుం డంతో ఆయా జిల్లాల కలెక్టర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. గుండ్ల కమ్మకు వస్తున్న వరద నీరు, తగ్గుతుండటం తో 70 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఈరోజు అధిక వర్షాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వాగుల గట్లు, కాల్వ గట్లు పట్ల అప్రమతం గా ఉండాలని ఆదేశించామని అన్నారు .

టెండర్ ప్రక్రియను ఆపాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు సంబంధించిన టెండర్ ప్రక్రియను తక్షణమే ఆపాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్య కళాశాలల నిర్మాణాన్ని కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. పిపిపి విధానం లోకి 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకువచ్చే టెండర్ ప్రక్రియను ఆపాలని హైకోర్టులో పిల్ విచారణకు వచ్చిన సందర్భంగా ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు వ్యాఖ్యానించడం దురదృష్టకరమని సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా సంక్షేమానికి సమాజ శ్రేయస్సుకి విరుద్ధంగా ఉంటే జోక్యం చేసుకోకుండా కోర్టులు దూరంగా ఎలా ఉండగలవని ఆయన అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలోకి మార్చి ప్రైవేట్ పరం చేయటం రాజ్యాంగానికి లోబడి ఉన్నదా లేదా అన్నది పరిశీలించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం ప్రాథమిక హక్కులకు భంగకరమని, ప్రభుత్వ నిర్ణయం సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తుందన్నారు. ఈ విషయంలో ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకొని ప్రజాప్రయోజనాలు కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కులాల మధ్య చిచ్చు పెట్టడమే వైసీపీ పెట్టుబడి